# ప్రేమ రూపం

వారం దినాల నుంచీ తంటాలు పడుతున్నా. అనుకున్నట్లు ప్రేమౌన్నత్యం వుట్టిపడే అపూర్వమైన ప్రేమకథ రాయలేకపోతున్నాను. త్యాగపరంపరలతో నిండిన అద్భుత యితివృత్తం దొరికి చావలేదు.

యీ మధ్య నా హృదయ సౌకుమార్యం మొద్దుబారిపోయిందేమో ననే అనుమానం కలిగింది. అక్కడికీ వాణ్ణీ వీణ్ణీ యక్షప్రశ్నల్తో వేధిస్తూనే వున్నా- రాయబోయే కన్నీళ్ళ కథకు ముడిసరుకు దొరుకుతుందేమోనని. యీ ముడిసరుకు దొరకటం అట్లావుంచి, నేను నా గదిలో తీరిగ్గా ఆలోచించుకోటానికీ, రాయటానికీ వీల్లేకుండా పక్కగదిలో ఒకటే సంత!

యీ యింటి వోనరుకు బుద్ధిలేదు. ఆస్పత్రి రోగాలవాళ్ళకో, జూనీలు చేసుకొని కోర్టుచుట్టూ తిరిగే గ్రామపార్టీల వాళ్ళకో, నా గది పక్కగదిని అద్దెకిస్తాడు. రోగాలవాళ్ళు ఆస్పత్రి పాలైతే, వాళ్ళవెంట వచ్చిన బంధువులు యీ గదిపాలై నన్ను హింసిస్తారు. ఖూనీకేసుల్లో యిరుక్కున్న వాళ్లు జైలుపాలైతే, వాళ్ళ మనుషులు యీ గదిలో చేరి నన్ను వేపుక తింటారు.

రచనకు యేకాంతం దొరక్కపోవటం కన్నా హింస యేం కావాలి ?

ఉదయం యెవరో ఆస్పత్రి జనం దిగారు. ఒకటే గోల. యిప్పుడే కాస్త సద్దుమణిగింది.

అప్పుడే మొదలయింది, వరండాలోంచి యేదో పల్లెపదం. జీవితంపట్ల నాకుండే సవాలక్ష భయాలూ, ఆందోళనలూ, అశాంతీ చాలవన్నట్లు యీ పల్లె పదం ! పదం పాడుతున్న ఆ మనిషి నెవతినో పీకనొక్కి చంపుదామని పించింది. అదీ మేలే, వురిశిక్ష పడుతుంది. వురిశిక్ష వుందే, అది సర్వరోగ నివారిణి. అయినా నాకు ప్రత్యేకంగా వురిశిక్ష యెందుకు ? యిప్పు డనుభవి స్తున్న శిక్ష చాలకనా ?

అదేమోగానీ కాసేపటికి పదం పాడేతీరు బాగానే వున్నట్లనిపించింది. నాకెందుకో గానీ ఆ క్షణంలో గొప్ప ప్రేమికురాలి వియోగగీతంలా, నిరాశా దగ్ధ హృదయ సంగీతంలా ఆ పాట తోచింది. గాయకురాల్ని చూడా లనిపించింది. పాడే ఆమె తప్పకుండా వయస్సులోవున్న యే అందమైన విధవరాలో అయి వుంటుంది. నా సిక్త్సెన్స్ మీద - అంటే నా ఆరోస్పృహమీద - నాకామాత్రం విశ్వాసం లేకపోతే నేను కథలు రాసేవాణ్ణి కాదు.

వరండాలోకి వెళ్ళాను.

బియ్యం చేట ముందు వేసుకొని మాసిన తెల్లచీరలో వో ముసలామె ఆ పాడే వ్యక్తి. అతి మామూలు దుస్తుల్లో, అతి సామాన్యమైన అందం. ఈమెకు నొసట బొట్టువుంటే మా అమ్మలాగే ఉండేది. చచ్చిపోయిన మా అమ్మ వయస్సే. గతుక్కుమన్నాను. నా ఆరోస్పృహ నన్ను వెక్కిరించింది.

ఆ ముసలామె నన్ను చూస్తూనే పాట ఆపి అంది:

"యేం నాయనా ! యీ పక్కన వుండేది నువ్వేనా ?"

సమాధానంగా ఒక వెర్రినవ్వు నవ్వాను.

"అట్లా ఆ నులక మంచంమీద కూచో నాయనా," అంది.

కూచున్నాను. ముసలామె బియ్యం చెరగటంలో మునిగింది.

ఈమె జీవితంలో ఒక అపూర్వ ప్రేమ ఘట్టం యెందు కుండకూడదూ ? యేమో ? యెవరు చూశారు ? యే పుట్టలో యే పాముందో ! నా కథకు వస్తువు దొరక వచ్చునేమో ! మాటల్లోకి దించాను.

"ఆ పదం పాడుతూంటే నీ కేమని పిస్తుందవ్వా?" అని నేను అడిగితే-

"యేమనిపిస్తుంది నాయనా - యేదో గాలిపాట !" అంటూ ముసలవ్వ బియ్యంలోని రాళ్ళనూ, మట్టి బెడ్డలనూ యేరి పారేస్తూంది.

గడుసుదే. గాలి పాట అని బుకాయిస్తోంది. గాలిపాటే అయితే ఆ పాట నాలో కలిగించిన అనుభూతి సంగతేమిటి అనుకున్నాను. పత్రికా విలేకరిలాగా ప్రశ్నలు మనసులో సిద్ధం చేసుకున్నాను :

"ఆస్పత్రికి పొద్దున తీసుక పోతున్నారే, ఆ ముసలాయన నీ కేమవుతాడు? యేమైనా బంధువా?" అని ప్రశ్నించాను.

"అనుకుంటే అందరూ బంధువులే, నువ్వు కావా?" అని ఎదురు ప్రశ్న వేసి, "ఆస్పత్రికి పోతున్నాం, ఒక నెల రోజులు మా కింత వండి పెట్టమంటే వచ్చినా" అంది.

"నువ్వే యెందుకు రావాలి, ఆయన తరపున ఆడవాళ్ళే లేరా?" అని యెదురు ప్రశ్న వేశాను.

"పనుల కాలం కద నాయనా! నాకంటే యిదే పని" అంది.

"అంటే నీ కెవ్వరూ లేరా?" అని అడిగాను.

"నాదో పనికిమాలిన కతలే నాయనా!" అంది. బియ్యం కడుగుతూ కాసేపు మాట్లాడలేదు. తప్పకుండా ఈమెది విశిష్టమైన జీవితమే అయివుంటుంది అనుకున్నాను. మళ్ళీ ప్రశ్నించేలోగా బియ్యం కడిగి నిర్వికారంగా "ఒకప్పుడు సంసారముండేది" అని ఆపింది. బియ్యంకుండ పొయ్యిమీద పెట్టి "పిల్లాజెల్లా వుండేవాళ్ళు" అని పూర్తి చేసింది. యేం చెబుతుందోనని ఆగాను. పొయ్యిలో పుల్లలుపెట్టి చూస్తూ కూచుంది.

"యిప్పుడేమైనారు?" అని నేను అడగక తప్పలేదు.

అవ్వ సమాధానం చెప్పేలోగా పాప్లిన్ చొక్కా, మల్లువంచె, పైపంచలో వచ్చిన వ్యక్తి అవ్వను అడిగాడు :

"యేం అచ్చమ్మా! యింకా అన్నం కాలేదా? యింత మాంసం తెచ్చిస్తా గానీ వండిపెట్టు. నీచేతి వంట తినక చాలారోజులైంది. దానికి తోడు యీ ఆస్పత్రుల వెంట తిరిగి తిండి పట్టించుకోకపోతే ఆస్పత్రుల్లో వుండేవాళ్ళకాదు గుంతకు పోయేది...నేను."

అవ్వ నవ్వుతూనే :

"యెవరెట్లా పోతేనేం, గుంతనక్క లాగా తింటావు, తిరుగుతావు. ఆస్పత్రులకు వచ్చేవాళ్లు, కోరటులకు వచ్చేవాళ్ళు, ఆ సారాయి సుబ్బులూ వున్నంతవరకూ నువ్వెందుకు సస్తావు? ఆ తెచ్చే మాంసమేదో తొందరగా తెచ్చిపడెయ్యి" అని పాప్లిన్ చొక్కాకు సమాధానం చెప్పింది.

"నువ్వు పక్కరూంలో వుంటున్నావు కదా? పొద్దున చూసినాలే, యేదో దంతెలు లెక్కబెడుతూ ఆలోచిస్తున్నావు. నీకేం పని లేదా?" అని అడిగాడు. నేను సమాధానంగా నవ్వాను.

"నీ మాదిరి పేగులు లెక్కపెట్టే రకం కాదులే, పాపోడు" అంటూ అచ్చమ్మవ్వ పాప్లిన్ చొక్కావాణ్ణి రెండు అంటించింది.

"పేగులు లెక్కపెట్టేవాణ్ణే అయితే నిన్ను వదులుకోని, ఆ సుబ్బులు కెందుకు చిక్కుతాను? సరే, మాంసం తెస్తావుండు" అంటూ అచ్చమ్మవ్వ మరేం తగిలుస్తుందోనని పాప్లిన్ చొక్కా వెళ్ళిపోయాడు.

అచ్చమ్మవ్వకు ప్రేమమర్మం వుంది. అది తెలుసుకోవాలనుకున్నాను.

"యీయన యెవరవ్వా?" అని అడిగాను.

"మా వూళ్ళో అందరూ 'పాపిలిన్ యీరాడ్డి' అంటార్లే" అని నవ్వింది.

తర్వాత యెట్లా అడగాలో యే మడగాలో నాకు తోచలేదు. 'నిన్ను వదులుకోని' అన్నాడు పాప్లిన్ వీరారెడ్డి. బహుశా వాళ్ళింట్లో వంటమనిషిగా వుండేదేమో? అయినా అనుమానం పీకుతూనే వుంది. జంకుతూ జంకుతూనే "ఆయన నీ కేవన్నా చుట్టమా అవ్వా?" అని అడిగాను.

"కొంతకాలం కాపురం సేసినాలే, యీ యీరాడ్డితో" అంది.

మరి యీ ముండ మోసుకోవట మేమిటి అని అడగటానికి సంస్కారం అడ్డు వచ్చింది. "అదేదో సంసారమూ, పిల్లా జెల్లా అంటివే?" అని మర్మంగా అడిగాను.

"అదా? అంతకు ముందు కతలే, అది పెద్దోళ్ళు సేసిన పెళ్ళి కత" అని ఆగింది.

"నీ కిష్టంలేని పెళ్ళా?" అని అడిగాను.

"అవన్నీ నా కెట్లా తెలుస్తాయి నాయనా? పెద్దోళ్ళు చేసినారు. బాగో వోగో కాపురం సేసినాను. మావాళ్ళు మంచోడే. యీ యీరాడ్డే తాగుడు నేర్పకపోతే నాలుగు కాలాలు బతికుండేవాడు. పాసిమొకంతోనే తాగేది నేర్పినాడు, యీ యీరాడ్డి."

"యెందుకు నేర్పినా"డని అడిగాను.

"తానూ తాగడానికి" అంటూ అచ్చమ్మవ్వ పసిపిల్లలా నవ్వింది.

"ఆ తర్వాత?" అన్నాను.

"యేముంది? తాగి తాగి అదేదో కడుపులో పుండుతో యీ ఆస్పత్రిలోనే పోయినాడు. తాగుడుకూ, రోగానికి ముక్కాలు బాగం ఆస్తిపోయింది. ఒక్కగా నొక్కపిల్లా పెద్దమనిసైతే పెళ్ళి సేసినా. యీ యీరాడ్డే పెద్ద సంబంధమన్నాడు. మూడో నెల తిరక్కముందే దాని మొగుడేదో పెద్ద రోగంతో సచ్చిపోయినాడు. యీ గొడవల్లో వున్నది వూడ్సక పోయింది, ఆ తర్వాత తంటాలుపడి కూతురుకు మారు మనువు సేసినాను. సెడి కూతురింటికి పోలేక యీ యీరాడ్డి పంచన సేరినా."

అచ్చెమ్మవ్వ తన కథ చెబుతూంటే ఆమె కంఠంలో యెక్కడా విషాదం లేదు. ఆ నిర్లిప్తత చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. పాప్లిన్ వీరారెడ్డితో కాపురం పట్ల అవ్వమీద కోపం, జుగుప్స కలిగాయి.

"మీ కంత అన్యాయం చేసిన వీరారెడ్డినే ఎందుకు నమ్మినట్లు?" అని అడిగాను.

"యింక యెవరిని నమ్మవంటావు నాయనా? గంతకు తగిన బొంత" అని అవ్వ నావైపు చూసింది.

"అయితే నువ్వు మారుమనువు చేసుకున్నావన్న మాట, కూతురుకూ మారు మనువు చేసి" అని కాస్తా కసిగా అడిగాను.

"మారు మనువా మట్టా? మా యిళ్ళల్లో మారు మనువుంది కానీ కాపోళ్ళ యిళ్ళల్లో మారు మనువు యెక్కడుంది? మా వూరు సానా సెడ్డ కొంప. వూళ్ళో దిక్కులేని ఆడదని నలుగురూ కుక్కలు యెగబడినట్లు యెగబడకుండా యీ యీరాడ్డిని నమ్ముకున్నా. ఒకర్ని నమ్ముకోడం నీతి కదా నాయనా?" అని యెదురు ప్రశ్న వేసింది.

"తర్వాత వీరారెడ్డి నిన్ను వదిలివేసినాడా?" అని అడిగేను.

"ఆఁ! సారాయి యాపారం సేసే సుబ్బులు తోడయింది. నేను వంటచేసే దాన్నే. నాతో కర్సేగానీ లాబ మేముంది? పదేళ్ళ నుంచీ దాంతోనే కాపురం చేస్తున్నాడు. కాస్త పచ్చగానే వున్నాడు. అప్పట్నుంచీ యీ కట్టె ఒంటిగానే. వూళ్ళో పెద్దోళ్ళు పెండ్లిండ్లకు పిలిస్తే పోతాను. యెవరన్నా ఆస్పత్రులకు వచ్చే వాళ్ళు రమ్మంటే రావడం. యిట్లాంటి పని లేనప్పుడు యే యింట్లోనో పనీ పాటా. ఏదో జరిగిపోతాంది" అని సమాధాన మిచ్చింది.

"వీరారెడ్డి నీకు అన్యాయం చేసినాడనిపించలేదే మవ్వా?" అన్నాను.

"యెవళ్ళ బుద్ధి ప్రకారం వాళ్ళు పోతారు. యెవరి బాగు వాళ్ళది," అని తాత్వికంగా అంది.

పళ్ళు బిగపట్టుకొని ఆఖరు ప్రశ్న వేశాను: "నీకు మొదటి భర్త అంటే ప్రేమ వుండేదా? యీ వీరారెడ్డి మీద యెక్కువ ప్రేమ వుండేదా?"

"అదేందో నాకు తెలీదు నాయనా, పెద్దోళ్ళు చేస్తే మొదటి మనువయింది. దిక్కులేక రెండోసారి దారి తోడయింది. యివన్నీ యింత తిండికీ, బట్టకూ, మగ మనిషి చాటుకోసమే కదా? అదేందీ ఆ ప్రేమలేం సేసుకుంటాము? వాటిని కొరుక్కొని తిని బతకలేం కదా? పెళ్తా నాయనా, వంటపని సానా మిగిలింది. యీరాడ్డికి పసిగా మాంసం చేసి పెట్టాలంట!" అంటూ అవ్వ మళ్ళీ పల్లె పదం యెత్తుకొని పాడుతూ గదిలోకి వెళ్ళింది. నా తల తిరిగిపోయింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు అచ్చమ్మవ్వ ప్రేమకథ వున్నదున్నట్లు రాశాను. యింత కాలంగా నా కథలు మెచ్చుకుంటున్న నా అభిమాన పాఠకురాలు తిట్లకు లంకించుకుంది: 'మీకేం పిచ్చి పట్టలేదు కదా? ఇంత పనికిమాలిన కథ రాశారు? నీతీ జాతీలేని అచ్చమ్మలో యేం ప్రేమ మీకు కన్పించింది? యే ప్రత్యేకత వుంది?' యిట్లా నాలుగు పేజీల వుత్తరం రాసింది.

"మీ అందరి జీవితాల్లో కారిపోయే ప్రేమలేమిటి? ప్రేమల్లో దాంపత్యాల్లో యే ప్రత్యేకతలున్నాయి? మన జీవితంకన్న అచ్చమ్మవ్వ జీవితం గొప్పది. అచ్చమ్మ తన అరక్షణను గుర్తించింది. ప్రేమను శాసించే సూత్రాల్ని గుర్తించింది. యివి మనం గుర్తించామా?" అని వళ్ళు మంటతో నా అభిమాన పాఠకురాలికి సమాధానం రాశాను.

నా అభిమాన పాఠకురాలు నాకు వుత్తరాలు రాయటం మానుకుంది. నీతిలేని కథ అని పాఠకుల వుత్తరాల్లో తెగ తిట్టి పోసింది. మరో డజను పత్రికాభిమానులు తిట్టటానికి ప్రేరణ అయ్యింది, ఆమె వుత్తరం. జీవితంలోని ప్రేమ స్వరూపాన్ని గుర్తించటంలో, కథ రాయటంలో 'పావ్‌లావ్ కుక్క'ను కానందుకు నేనేమో సంతోషిస్తున్నాను.

○ సెప్టెంబరు 1977, పీచిక మాసపత్రిక.